ఈవీఎం మెషీన్లు ఇవ్వండి.. లోపాల్ని బయటపెడతాం

ఎన్నికల సంఘాన్ని కోరిన సుప్రీంకోర్టు లాయర్లు

న్యూఢిల్లీ, జనవరి 2: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)లో ఎన్నో లోపాలున్నాయని, తమకు 50 సీల్డ్ ఈవీఎంలు అప్పగిస్తే.. అందులోని అక్రమాల్ని బయటపెడతామని సుప్రీంకోర్టు న్యాయవాదుల గ్రూప్ ఒకటి కేంద్ర ఎన్నికల సంఘానికి సవాల్ విసిరింది. ఈ అంశానికి సంబంధించి జనవరి 5న పాటియాలా హౌస్ కోర్టు నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి న్యాయవాదుల గ్రూప్ పాదయాత్ర చేపట్టింది. ఈవీఎం లోపాల్ని బయటపెట్టే నిమిత్తం తమకు 50 సీల్ వేసిన మెషీన్లు ఇవ్వాలని కోరుతూ ఓ పిటిషన్ ఈసీకి ఇవ్వబోతున్నది. మంగళవారం న్యూఢిల్లీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో న్యాయవాదుల గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ, 'కేంద్ర ఎన్నికల సంఘం తనంత తానుగా 2017 లో సవాల్ విసిరింది. ఈవీఎం మెషీన్ల హ్యాకింగ్, లోపాలు బయటపెట్టాలని కోరింది. ఈ నేపథ్యంలో మాకు ఓ 50 సీల్డ్ మెషీన్లు ఇస్తే, వాటిని ఆయా రాష్ట్రాల రాజధానులకు తీసుకెళ్తాం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో ఈవీఎం లోపాల్ని అందరిముందు బయటపెడతాం. మెషీన్ల ఎలా హ్యాకింగ్ చేయొచ్చో మీడియా, ప్రజల ముందు చూపుతాం' అని అన్నారు.

క్వాంటం కమ్యూనికేషన్ ఎన్క్రిప్షన్ సాధించాం!

- దీన్ని హ్యాక్ చేయడం సాధ్యపడదు
- విజయవంతమైన పరీక్షలు
- చైనా, రష్యా సైంటిస్టుల ప్రకటన

బీజింగ్, జనవరి 2: హ్యాకింగ్‌కు సాధ్యపడని క్వాంటమ్ కమ్యూనికేషన్ లింక్‌ను విజయవంతంగా పరీక్షించినట్టు చైనా, రష్యా శాస్త్రవేత్తలు ప్రకటించారు. రోదసిలోని చైనా క్వాంటం కమ్యూనికేషన్ శాటిలైట్ 'మోజి'లోని సెక్యూర్ కీలను ఉపయోగించి 'క్వాంటం కమ్యూనికేషన్ ఎన్‌క్రిప్షన్' సాధించామని వారు తెలిపారు. 'మోజి' శాటిలైట్‌తో క్వాంటం కమ్యూనికేషన్ సేవల పరిధి 4 వేల కిలోమీటర్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలన, ఆర్థికం, రక్షణ, వ్యూహాత్మక ఏజెన్సీలకు సురక్షితమైన, అత్యంత భద్రతతో కూడిన సమాచార వ్యవస్థ అందించేందుకు 'మోజి' శాటిలైట్‌ను చైనా ప్రయోగించింది. ఎవ్వరూ హ్యాక్ చేయలేని, అవరోధాలు కల్పించలేని సమాచార వ్యవస్థ 'క్వాంటం కమ్యూనికేషన్'తోనే సాధ్యమని సైంటిస్టులు భావిస్తున్నారు. దీంట్లో క్వాంటం మెకానిక్స్ ఆధారంగా సమాచారం 'ఎన్‌క్రిప్ట్' అవుతుంది. మధ్యలో ఎవరూ దీనిని 'డీక్రిప్ట్' చేయలేని విధంగా మారిపోతుంది. సున్నితమైన, అత్యంత కీలక సమాచారానికి 'క్వాంటం కమ్యూనికేషన్స్' చాలా ముఖ్యమైందిగా చైనా, రష్యాలు భావిస్తున్నాయి.

వారానికి ఒక్కసారే నీటి సరఫరా

మహారాష్ట్రలోని లాతూర్‌లో తీవ్ర నీటి కటకట

లాతూర్, జనవరి 2: మహారాష్ట్రలోని లాతూర్ నగరంలో నీటికి కటకట ఏర్పడింది. ఈ ప్రాంతంలో తక్కువ వర్షపాతం నమోదవ్వడంతో మంజర డ్యామ్‌లో నీటి నిల్వ శాతం దాని సామర్థ్యంలో 20 శాతానికి పడిపోయింది. దీంతో లాతూరులో వారానికి ఒక్కసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ వరకు ఇక్కడ వారానికి రెండు సార్లు అదీ 150 నిముషాలు చొప్పున సరఫరా చేసేవారు. అయితే దానిని వారానికి ఒకసారికి మార్చడంతో పాటు 90 నిముషాలు మాత్రమే నీటిని వదులుతున్నారని స్థానికులు వాపోతున్నారు. మంజర డ్యామ్ నుంచి లిఫ్ట్ చేసే నీటిని కూడా ఒక మిలియన్ క్యూబిక్ మీటర్లకు తగ్గించినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ చవాన్ తెలిపారు. 2016లో కూడా వర్షాలు కురవక లాతూరులో కరువు పరిస్థితులు ఏర్పడటంతో మహారాష్ట్ర పశ్చిమ ప్రాంతం నుంచి ఇక్కడకు ప్రత్యేక రైలు ద్వారా నీటిని సరఫరా చేశారు.

రోగి నిరాకరిస్తే ఐసీయూలో చేర్చుకోవద్దు

తీవ్ర అనారోగ్యం ఉన్నా.. రోగి నిర్ణయానికి ప్రాధాన్యం

బతికే అవకాశం లేనప్పుడు ఐసీయూలో ఉంచడం వృథా

దవాఖానలకు కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జనవరి 2: దవాఖానలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో రోగులను అడ్మిట్ చేసుకోవటంపై కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీచేసింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్న పేషెంట్ లేదా అతడి బంధువులు నిరాకరిస్తే.. సదరు రోగిని దవాఖానలు ఐసీయూలో అడ్మిట్ చేయరాదని స్పష్టంచేసింది. ఈ మేరకు మంగళవారం కొత్త మార్గదర్శకాల్ని విడుదల చేసింది. ఐసీయూలో రోగి అడ్మిషన్, వైద్య చికిత్సకు సంబంధించి పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల్ని కేంద్రం తాజాగా వెల్లడించింది. తీవ్ర ఆరోగ్య సమస్య నుంచి రోగిని కాపాడేందుకు మాత్రమే ఐసీయూ అడ్మిషన్ కారణం అవ్వాలని దవాఖానలకు సూచించింది. ఒక వేళ రోగి, అతడి బంధువులు నిరాకరిస్తే ఐసీయూ నుంచి సదరు రోగిని డిశ్చార్జ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ అంశానికి సంబంధించి 24 మందితో కూడిన నిపుణుల కమిటీ కేంద్ర ప్రభుత్వానికి పలు సిఫారసులు చేసింది.

ఎప్పుడు చేర్చుకోవద్దు?

మహమ్మారి లేదా విపత్తు పరిస్థితుల్లో, పరిమిత వనరులున్నప్పుడు పేషెంట్‌ను ఐసీయూలో ఉంచటానికి తక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. తదుపరి వైద్య చికిత్స సాధ్యం కానప్పుడు లేదా అందుబాటులో లేనప్పుడు, అప్పటివరకు అందిస్తున్న వైద్య చికిత్సతో ఫలితం లేనప్పుడు, ముఖ్యంగా రోగి జీవించే అవకాశం లేనప్పుడు.. ఐసీయూలో చేర్చుకోవద్దని మార్గదర్శకాల్లో కేంద్రం తెలిపింది. రోగి లేదా అతడి బంధువుల నిర్ణయానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వారు నిరాకరిస్తే.. రోగిని ఐసీయూలో చేర్చుకోరాదని స్పష్టంచేసింది.

ఎప్పుడు చేర్చుకోవచ్చు?

అవయవ వైఫల్యం, ఆర్గాన్ సపోర్ట్ అవసరమైనప్పుడు, రోగి ఆరోగ్యం విషమించే పరిస్థితులు ఉన్నప్పుడు ఐసీయూలో చేర్చుకోవచ్చు. శస్త్ర చికిత్స తర్వాత పరిస్థితి దిగజారితే.. అప్పుడు కూడా పేషెంట్‌ను ఐసీయూలో కొనసాగించవచ్చు. గుండె, శ్వాసనాళాల్లో సమస్యలు, శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులను కూడా ఐసీయూలో చేర్చొచ్చు. అలాగే ఐసీయూలో రోగిని చేర్చేముందు.. బీపీ, పల్స్ రేటు, శ్వాసకోశ రేటు, శ్వాస విధానం, హృదయ స్పందన, ఆక్సిజన్ శాచురేషన్ తదితర అంశాలను పర్యవేక్షించాలి.

'అదానీ-హిండెన్‌బర్గ్' పై నేడు సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, జనవరి 2: అదానీ గ్రూపు అక్రమాలకు సంబంధించి హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలపై న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం తీర్పు వెలువరించనున్నది. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం గత ఏడాది నవంబర్ 24న తీర్పు రిజర్వ్ చేసింది. హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ గ్రూపు చట్టం ఉల్లంఘనకు పాల్పడిందా? అనేదానిపై దర్యాప్తు జరపాలని గత ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్ 'సెబీ'ని ఆదేశించింది. ఈ క్రమంలో దర్యాప్తును పూర్తి చేయడంలో సెబీ ఆలస్యం చేస్తున్నదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దర్యాప్తు పూర్తి చేయడానికి సుప్రీంకోర్టు పెట్టిన డెడ్‌లైన్‌ను పాటించనందుకు సెబీపై ఉల్లంఘన చర్యలు తీసుకోవాలని పిటిషన్‌దారు కోరారు.

5న దావూద్ చిన్ననాటి ఇల్లు వేలం

న్యూఢిల్లీ, జనవరి 2: ముంబై వరుస బాంబు పేలుళ్ల నిందితుడు, ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం చిన్ననాటి ఇంటితో పాటు అతడి కుటుంబానికి చెందిన మూడు వ్యవసాయ భూములను ఈ నెల 5న వేలం వేయనున్నారు. ఈ ఆస్తులన్నీ ముంబాకే గ్రామంలో ఉన్నాయి. చట్ట ప్రకారం సీజ్ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.19 లక్షలు. దావూద్ ఇబ్రహీంకు చెందినని కావడం వల్ల వీటిని అమ్మడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో వీటిని వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు. వేలంలో పాల్గొనడానికి ఈ నెల 3లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

బ్రిక్స్‌లో మరో 5 దేశాలకు సభ్యత్వం

న్యూఢిల్లీ, జనవరి 2: ప్రపంచ వ్యవహారాల్లో పశ్చిమ దేశాల ఆధిపత్యం నేపథ్యంలో తన వ్యూహాత్మక ఎత్తుగడలను విస్తరించుకోవడంలో భాగంగా అయిదు దేశాలను పూర్తికాల సభ్యులుగా చేర్చుకొన్నామని బ్రిక్స్ ప్రకటించింది. ప్రస్తుతం బ్రిక్స్‌కు నాయకత్వం వహిస్తున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలను కొత్త సభ్యులుగా చేర్చుకొన్నామని తెలిపారు.

సీజేఐని ఎలా తొలగిస్తారు?

- సీఈసీ, ఈసీల నియామక కమిటీలో పారదర్శకత ఏది?
- కేంద్ర చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 2: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) నియామకానికి సంబంధించి తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దీనిని న్యాయవాది గోపాల్ సింగ్ దాఖలు చేశారు. సీఈసీ, ఈసీల నియామకాలకు సంబంధించిన కమిటీలో నుంచి సీజేఐను తొలగిస్తే పారదర్శకత ఎక్కడుంటుందని పిటిషనర్ ప్రశ్నించారు. అన్ని రకాల అధికారాలను తన గుప్పిట్లో పెట్టుకునేలా కేంద్రం చర్య ఉన్నదని తెలిపారు. పారదర్శకంగా స్వతంత్ర వ్యవస్థ ఉండేలా చూడాలని, ఇందుకోసం సమ దృష్టితో వ్యవహరించే కమిటీని ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని పక్కనపెట్టాలని విజ్ఞప్తి చేశారు. కాగా, కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల నియామక కమిటీలో ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కేంద్రమంత్రి ఉంటారు.

మారిన యూపీఐ రూల్స్

ఈ నెల 1 నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ, జనవరి 2: స్మార్ట్‌ఫోన్ ఉన్న చాలామంది గూగుల్ పే, ఫోన్ పే, పేటీఏం వినియోగిస్తున్నారు. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్)ను ఉపయోగించి చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తంలో డిజిటల్ చెల్లింపులు జరుపుతున్నారు. అయితే యూపీఐ ద్వారా జరిపే చెల్లింపులపై జనవరి 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఆర్బీఐ, ఎన్పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తాజాగా పలు మార్పులను ప్రకటించాయి. వీటిలో లావాదేవీల పరిమితి పెంపు నుంచి యాక్టివ్‌లో లేని యూపీఐ ఐడీలను డీయాక్టివేట్ చేయడం వంటివి ఉన్నాయి. దవాఖానలు, విద్యాసంస్థలకు చేసే యూపీఐ పేమెంట్స్ లావాదేవీల పరిమితిని రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచారు. ఏడాది కాలంగా యాక్టివ్‌లో లేని ఖాతాల యూపీఐ ఐడీలు, నంబర్లను జనవరి 1 నుంచి రద్దు (డీయాక్టివేట్) చేయాలని ఎన్పీసీఐ ఆదేశించింది.

లావాదేవీలపై రుసుములు

ఆన్‌లైన్ వాలెట్ నుంచి ప్రీపెయిడ్ చెల్లింపు రూ.2వేల కంటే ఎక్కువ ఉన్నప్పుడు వ్యాపారి యూపీఐ లావాదేవీల కోసం 1.1 శాతం వరకు ఇంటర్‌ఛేంజ్ ఫీజు వసూలు చేయనున్నారు. మర్చంట్ లావాదేవీలు జరిగినప్పుడు వ్యాపారి నుంచి ఈ చార్జీలు వసూలు చేస్తారు. మోసాలను అరికట్టేందుకు నాలుగు గంటల పరిమితి నిబంధన తీసుకొచ్చారు. ఇంతకుముందు లావాదేవీలు చేయని వ్యక్తుల మధ్య రూ.2 వేల కంటే ఎక్కువ విలువ గల మొదటి చెల్లింపు కోసం నాలుగు గంటల పరిమితి విధించనున్నారు.

భర్తకు బదులు పిల్లలను నామినేట్ చేయొచ్చు

- ఫ్యామిలీ పెన్షన్ నిబంధనలు సడలింపు
- విడాకులు తీసుకున్న ఉద్యోగినులకు వెసులుబాటు

న్యూఢిల్లీ: విడాకులు తీసుకొన్న ఉద్యోగినులు భర్తకు బదులుగా పిల్లలను ఫ్యామిలీ పెన్షన్‌కు నామినేట్ చేసుకోవచ్చని కేంద్రం తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగి మరణానంతరం లేదా రిటైర్మెంట్ తర్వాత ఆ వ్యక్తి కుటుంబానికి పెన్షన్ మంజూరు చేయాలని సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) రూల్స్-2021లోని 50వ నిబంధన స్పష్టం చేస్తున్నది. ఈ నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్ మరణానంతరం తొలుత జీవిత భాగస్వామికి ఫ్యామిలీ పెన్షన్‌ను మంజూరు చేస్తారు. జీవిత భాగస్వామి మరణించాక లేక ఆ వ్యక్తి ఫ్యామిలీ పెన్షన్‌కు పొందే అర్హతను కోల్పోయిన తర్వాత మాత్రమే ఆ కుటుంబంలోని ఇతర సభ్యులు పెన్షన్‌కు అర్హులవుతారు. కానీ, ఇప్పుడు ఈ నిబంధనలను పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ విభాగం సవరించింది. విడాకులకు దరఖాస్తు చేసుకున్న లేదా గృహ హింస నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పిటిషన్ వేసిన ఉద్యోగిని భర్తకు బదులుగా పిల్లలను ఫ్యామిలీ పెన్షన్‌కు నామినేట్ చేసుకోవచ్చు.

చిత్రం

త్రివిక్రమ్ మల్టీ స్టారర్

త్రివిక్రమ్ శ్రీనివాస్, సూపర్ స్టార్ మహేశ్‌బాబు కాంబోలో వస్తున్న 'గుంటూరు కారం' ఈ సంక్రాంతికి సందడి చేయనున్నది. ఈ నెల 12న విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రచార కార్యక్రమాల్లో త్రివిక్రమ్ బిజీగా ఉన్నారు. 'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్.. అల్లు అర్జున్‌తో సినిమా చేయాల్సి ఉంది. ఇప్పటికే ఈ విషయాన్ని హారిక-హాసిని సంస్థ అధికారికంగా ప్రకటించింది కూడా. అయితే త్రివిక్రమ్ గురించి తాజా వార్త ఒకటి చక్కర్లు కొడుతున్నది. బన్నీ ప్రస్తుతం 'పుష్ప-2'తో బిజీగా ఉన్నారు. ఈ కారణంగా మాటల మాంత్రికుడితో అల్లు అర్జున్ చేయబోయే సినిమా ఆలస్యం కానున్నది. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ కూడా ప్లాన్ బీని సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. విక్టరీ వెంకటేశ్‌తో త్రివిక్రమ్ సినిమా చాలా రోజులుగా చర్చల్లో ఉంది. వెంకటేశ్ నటించిన 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. వీరిద్దరి కాంబోలో మరో సినిమా వస్తే బావుండన్న ఆకాంక్ష ప్రేక్షకుల్లోనూ ఉంది. త్రివిక్రమ్, వెంకీ కూడా ఇందుకు సిద్ధంగా ఉన్నారు. అందుకోసం ఓ ఫ్యామిలీ డ్రామాను త్రివిక్రమ్ రాసుకున్నారట. అయితే, ఇది సోలో హీరో సినిమా కాదని, త్రివిక్రమ్ దీన్ని మల్టీ స్టారర్‌గా ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో మరో హీరోగా నాని కనిపించబోతున్నారని టాక్. ఇండస్ట్రీలో కాంబినేషన్ల ఈక్వేషన్లు ఎప్పుడు ఎలా మారుతాయో చెప్పడం కష్టం. బహుశా అందుకే ఈ మల్టీ స్టారర్ ఫిల్మ్ వివరాలు గోప్యంగా ఉంచారేమో!

సంయుక్తమీనన్

అందుకే సినిమాలకు విరామం!

మలయాళ భామ సంయుక్తమీనన్‌ను టాలీవుడ్‌లో అదృష్ట నాయికగా అభివర్ణిస్తారు. 'భీమ్లానాయక్'తో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఈ సొగసరి..అనంతరం బింబిసార, సార్, విరూపాక్ష చిత్రాలతో వరుస విజయాలను సొంతం చేసుకుంది. ఇటీవలే 'డెవిల్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. తాజాగా ఈ అమ్మడి పెళ్లికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఏడాదిలో పెళ్లిపీటలెక్కే ఆలోచనలో ఈ అమ్మడు ఉందని..అందుకే కొత్త సినిమాలను అంగీకరించడం లేదని వార్తలొస్తున్నాయి. అయితే సంయుక్తమీనన్ సన్నిహితులు మాత్రం అవన్నీ సోషల్‌మీడియాలో వస్తున్న పుకార్లు మాత్రమేనని, బిజీ షెడ్యూల్‌కు కాస్త విరామం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో కొత్త ప్రాజెక్ట్‌లను అంగీకరించడం లేదని చెబుతున్నారు. ఈ పెళ్లి వార్తల్లో నిజమెంతో తెలియాలంటే ఈ భామ స్పందించాల్సిందేనని అభిమానులు కోరుకుంటున్నారు.

సోషియో ఫాంటసీ 'దేవుడే దిగివచ్చినా..'

యువహీరో బెల్లంకొండ శ్రీనివాస్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సాగర్‌చంద్ర దర్శకత్వంలో ఓ చిత్రాన్ని చేస్తున్నారు. ఈ సినిమాకు 'టైసన్ నాయుడు' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలిసింది. మరోవైపు మున్నా దర్శకత్వంలో బెల్లంకొండ సురేష్ ఓ చిత్రంలో నటించనున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించనుంది. దేవుళ్ల నేపథ్యంలో నడిచే సోషియో ఫాంటసీ కథ ఇదని తెలుస్తున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'దేవుడే దిగి వచ్చినా..' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని తెలిసింది. త్వరలో ఈ చిత్రం పట్టాలెక్కనుంది.

మా ఊరు సిత్రాన్ని సూద్దాం...

సుహాస్

సుహాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు'. దుశ్యంత్ కటికనేని దర్శకుడు. కామెడీ డ్రామా కథాంశమిది. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో 'మా ఊరు..' అనే లిరికల్ సాంగ్‌ను మంగళవారం విడుదల చేశారు. రెహమాన్ రాసిన ఈ పాటకు శేఖర్‌చంద్ర స్వరాలను సమకూర్చారు. కాలభైరవ ఆలపించారు. 'రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం..ఇటు రారో ఈ బతుకు పాటను ఇందాం...' అంటూ అర్థవంతంగా సాగిందీ గీతం. శివాని నాగరం, శరణ్యప్రదీప్, జబర్దస్త్ ప్రతాప్, గోపరాజు రమణ- తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వాజిద్ బేగ్, సంగీతం: శేఖర్ చంద్ర, రచన-దర్శకత్వం: దుశ్యంత్ కటికనేని.

వినోదాల బాలరాజు

సోహైల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకుడు. ఎం.డీ.పాషా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 2న విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన లభిస్తున్నది. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన పాటలు శ్రోతల్ని ఆకట్టుకుంటున్నాయి. వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఆద్యంతం వినోదంతో మెప్పిస్తుంది' అన్నారు. మేఘలేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ, అవినాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కే నాయుడు, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కథ: లక్కీ మీడియా యూనిట్, రచన-దర్శకత్వం: శ్రీకోనేటి.


సోహైల్

వరుణ్‌సందేశ్ కొత్త చిత్రం

వరుణ్‌సందేశ్

వరుణ్‌సందేశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఎమ్ 3 మీడియా నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా శ్రీఅద్వాన్త్ హర్ష దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ముహూర్తపు సన్నివేశానికి హీరో వరుణ్‌సందేశ్ క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ఇప్పటివరకు తాను నటించిన సినిమాలకు పూర్తి భిన్నమైన కథాంశమిదని అన్నారు. థ్రిల్లర్ కాన్సెప్ట్ ఇదని. వరుణ్‌సందేశ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని దర్శకుడు అద్వాన్త్ హర్ష తెలిపారు. రఘు కారుమంచి, ప్రమోదిని, బలగం జయరామ్, వైవా రాఘవ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అజయ్‌కుమార్, కథ, దర్శకత్వం: అద్వాన్త్ హర్ష.

సందేశంతో 'ల్యాండ్ మాఫియా'

ప్రణయనాథ, మధుబాల జంటగా నటిస్తున్న చిత్రం 'ల్యాండ్ మాఫియా'. బాబు వీన్ దర్శకుడు. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'యాక్షన్ ప్రధానంగా నడిచే చిత్రమిది. ప్రేమకథ కూడా ఉంటుంది' అన్నారు. కమర్షియల్ అంశాలు కలబోసిన సందేశాత్మక చిత్రమిదని, ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నామని హీరో, నిర్మాత ప్రణయనాథ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రదీప్‌చంద్ర.



'భ్రమయుగం'తో పాటల ప్రయాణం

వినోదరంగంలో పేరు పొందిన నైట్ షిఫ్ట్ స్టూడియోస్ తాజాగా మ్యూజిక్ ఇండస్ట్రీలోకి ప్రవేశించనుంది. 'నైట్ షిఫ్ట్ రికార్డ్స్' పేరుతో ఆడియో కంపెనీని ఆరంభించింది. నూతన ప్రతిభను ప్రోత్సహిస్తూ వర్ధమాన సంగీత ప్రతిభకు వేదికగా నిలవడమే తమ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు, నిర్మాత రామచంద్ర చక్రవర్తి తెలిపారు. తమ సంస్థ నిర్మిస్తున్న మలయాళ చిత్రం 'భ్రమయుగం' ద్వారా ఈ పాటల ప్రయాణం ఆరంభమవుతుందని ఆయన తెలిపారు. అగ్ర హీరో మమ్ముట్టి నటిస్తున్న ఈ చిత్రానికి క్రిస్టో జేవియర్ సంగీతాన్నందిస్తున్నారు.